సాక్షి
అనంతపురం
బుధవారం । 26 । ఫిబ్రవరి । 2025



చీనీ టన్ను రూ.22 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.22 వేలు పలికాయి.



టమాట కిలో రూ.10

అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
37.1°/15.2°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. చలి తీవ్రత తగ్గింది. గాలివేగం స్వల్పంగా పెరిగింది. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

హెచ్చెల్సీకి నీటి విడుదల



హెచ్చెల్సీలో పారుతున్న నీరు

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి మంగళవారం సాయంత్రం టీబీ బోర్డు అధికారులు నీటిని విడుదల చేశారు. కేసీ కెనాల్ నుంచి రివర్స్ డైవర్షన్ కింద 0.5 టీఎంసీల (అర టీఎంసీ) నీటిని మళ్లించారు. దీంతో కొంతమంది రైతులకు ఉపశమనం కలిగినట్లయింది. మరో టీఎంసీ విడుదల చేస్తే పంటల సాగుకు అనుకూలంగా ఉంటుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటి సమస్యలపై రేపు 'ఫోన్‌ఇన్'



కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగు నీటి సమస్యలపై ఈ నెల 27న 'అనంత మిత్ర ఫోన్ ఇన్' కార్యక్రమం నిర్వహించనున్నారు. కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆకాశవాణి కేంద్రం నుంచి ప్రజల ఫిర్యాదులు స్వీకరిస్తారు. 08554-225533, 296890 నంబర్లకు ఫోన్ చేసి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లవచ్చు.

విశిష్ట సంఖ్య పొందండి

- రైతులకు డీఏఓ ఉమామహేశ్వరమ్మ సూచన



మాట్లాడుతున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

కూడేరు: సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు తప్పనిసరిగా ప్రతి రైతు విశిష్ట సంఖ్య పొందాలని జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ సూచించారు. మంగళవారం కూడేరు మండలం ఇప్పేరులో వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్‌ఎస్‌కేల్లో రైతులు సంప్రదించాలన్నారు. రబీలో సాగు చేసిన వేరుశనగ, వరి పంటలో సమగ్ర సస్యరక్షణ, ఎరువుల యాజమాన్య పద్ధతులను పాటించాలని సూచించారు. ఏపీఎంఐపీ ద్వారా సబ్సిడీతో అందిస్తున్న డ్రిప్, స్ప్రింక్లర్ల గురించి వివరించారు. పంటల సాగులో రసాయన ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకే తెగుళ్ల నివారణకు మందులు పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ విజయ కుమార్, ఎంపీఈఓ శ్రీలత, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

దా'రుణ' మోసం!



ఉరవకొండలోని పీడీ లక్ష్మీనిధి కార్యాలయం

ఉరవకొండ: 'మా సంస్థలో రూ.20 వేలు డిపాజిట్ చేస్తే చాలు.. రూ.లక్ష వడ్డీ లేని రుణం అందిస్తాం' అంటూ డబ్బులు వసూలు చేసిన ఓ సంస్థ ప్రతినిధులు మొహం చాటేశారు. వివరాలు.. ఉరవకొండలో రెండేళ్ల క్రితం 'పీడీ లక్ష్మీనిధి లిమిటెడ్ సంస్థ' పేరిట కార్యాలయాన్ని ప్రారంభించారు. రూ.వెయ్యితో ఖాతా తెరిచి రూ. 20 వేలు డిపాజిట్ చేస్తే.. వడ్డీ లేకుండానే రూ.లక్ష రుణం అందిస్తామంటూ ఉరవకొండతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో ప్రచారం చేశారు. దీంతో 50 మంది రూ. 20 వేలు డిపాజిట్ చేయగా.. 20 మందికి రుణం అందించారు. ఈ విషయం తెలిసిన మరో 80 మంది వరకు గత ఏడాది అక్టోబర్‌లో రూ.20 వేలు డిపాజిట్ చేశారు. అయితే, అప్పటి నుంచి రుణాల కోసం తిరుగుతున్నా పట్టించుకోకపోవడంతో మంగళవారం 'పీడీ లక్ష్మీనిధి లిమిటెడ్ సంస్థ' కార్యాలయ సిబ్బందిని నిలదీశారు. ఈ క్రమంలో సంస్థ ప్రతినిధుల బండారం బయటపడింది. గతంలో కూడా కొందరు ఖాతాదారులు అనంతపురంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఇదే విషయమై కేసు పెట్టినట్లు సమాచారం. సంస్థ ప్రతినిధులను పోలీసులు పట్టుకునే ప్రయత్నంలో ఉన్నారని తెలిసింది.

కరుణ లేకుండా కట్‌కటా!

తీరు మార్చుకోని బాబు

- ఎంసీహెచ్, సర్జికల్ బ్లాక్ నిర్మాణ నిధుల కోత
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.300 కోట్లు మంజూరు
- తాజాగా రూ.78 కోట్లకే కుదించిన చంద్రబాబు ప్రభుత్వం
- గర్భిణులు, చిన్నారులకు నాణ్యమైన వైద్యం దూరం
- గతంలో ఎయిమ్స్ విషయంలోనూ తీరని అన్యాయం



అనంతపురం సర్వజనాస్పత్రి వద్ద నూతనంగా నిర్మిస్తున్న సర్జికల్ బ్లాక్

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చొరవతో 'నాడు-నేడు' పథకం కింద సర్వజనాస్పత్రికి అనుబంధంగా పలు భవనాలు నిర్మించాలని సంకల్పించారు. ఈ క్రమంలోనే రూ.300 కోట్లతో సర్జికల్, ఎంసీహెచ్ బ్లాక్‌లు, పీజీ హాస్టళ్లు నిర్మించేందుకు ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. ఇందులో రూ.215.15 కోట్ల పనులకు సంబంధించి అగ్రిమెంట్ కూడా చేసుకుంది. రూ.72 కోట్లతో ఎంసీహెచ్ బ్లాక్ (జీప్లస్ 5), రూ.68 కోట్లతో సర్జికల్ బ్లాక్ (జీప్లస్ 6), రూ.22 కోట్లతో మెన్స్,ఉమెన్ పీజీ హాస్టల్ (జీప్లస్ 7) భవనాలు, మిగిలిన నిధులతో మౌలిక సదుపాయాలు, పరికరాలు కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టారు.

'కూటమి' వింత నిర్ణయం..

కూటమి ప్రభుత్వం వచ్చాక నాడు-నేడు పథకంపై శీతకన్ను వేసింది. వైఎస్ జగన్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందనే ఉద్దేశంతో కక్ష కట్టింది. తాజాగా రూ.300 కోట్ల సర్జికల్, ఎంసీహెచ్ బ్లాక్‌లు, పీజీ హాస్టళ్ల ప్రాజెక్ట్‌ను రూ.78 కోట్లకే కుదిస్తూ వింత నిర్ణయం తీసుకుంది. జీప్లస్ 6 మేర నిర్మించాలనుకున్న సర్జికల్ బ్లాక్‌ను జీప్లస్ 1కి కుదించింది. సర్జికల్ బ్లాక్ ఏర్పాటైతే 200 పడకలు వచ్చేవి. కానీ, సర్కారు నిర్ణయంతో కేవలం 50 నుంచి 100 పడకలు మంజూరు కానున్నాయి.

'ఎంసీహెచ్' ఆశలు ఆవిరి..

నిధుల కుదింపుతో మదర్ చైల్డ్ హెల్త్ బ్లాక్ (ఎంసీహెచ్) ఆశలు ఆవిరయ్యాయి. వాస్తవంగా ప్రభుత్వ వైద్య కళాశాల ముందున్న ఆర్‌అండ్‌బీ కార్యాలయ ప్రాంగణంలో 200 పడకలతో 'ఎంసీహెచ్' ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇంకా ఆ భవనాన్ని స్వాధీనం చేసుకోకపోవడంతో నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వ సర్వజనాస్పత్రి గైనిక్ విభాగంలో 4 యూనిట్లు, చిన్నపిల్లల విభాగంలో మూడు యూనిట్లు ఉన్నాయి. ఇక్కడ రోజూ వెయ్యి మంది వరకు గర్భిణులు, బాలింతలు, పసికందులు, చిన్నారులు సేవలు పొందుతుంటారు. ప్రసవాలు రోజూ 20 నుంచి 30 వరకూ జరుగుతాయి. ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలకు పెద్దదిక్కయిన ఆస్పత్రిలో 'ఎంసీహెచ్' ఏర్పాటైతే పేదలకు మరింత మెరుగైన సేవలందేవి. అయితే, కూటమి ప్రభుత్వం మాత్రం అవేమీ పట్టించుకోకుండా నిర్దయగా నిర్ణయం తీసుకోవడం గమనార్హం. మరోవైపు సర్జికల్, ఎంసీహెచ్ బ్లాక్‌ల ఏర్పాటుతో పదుల సంఖ్యలో వైద్యులు, 50 నుంచి 60 మంది స్టాఫ్‌నర్సులు, మరో 50 మంది ల్యాబ్ టెక్నీషియన్లు, ఎంఎన్‌ఓ, ఎఫ్‌ఎన్‌ఓ తదితర పోస్టులు మంజూరై ఉపాధి కల్పన కూడా జరిగేది. కానీ సర్కారు నిర్ణయంతో అది కూడా దూరమైంది.

గతంలోనూ ఇంతే..

చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడల్లా జిల్లాకు అన్యాయం జరుగుతూనే ఉంది. 2014-19 సమయంలో జిల్లాకు ఎయిమ్స్ మంజూరైతే అప్పట్లో చంద్రబాబు దాన్ని మంగళగిరికి తీసుకెళ్లారు. తాజాగా రూ. 300 కోట్ల ప్రాజెక్టును కుదించి తీరని అన్యాయం చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు మంత్రులుగా ఉన్నా ఇలా అవుతుండటం గమనార్హం.

నిధుల కుదింపు వాస్తవమే

గతంలో సర్జికల్, ఎంసీహెచ్ బ్లాక్, మెన్స్, ఉమెన్స్ హాస్టల్ మంజూరు అయ్యింది. తాజాగా ఆ ప్రాజెక్ట్‌ను రూ.78 కోట్లకు కుదించారు. ప్రస్తుతం సర్జికల్ బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్ పనులు, మెన్స్, ఉమెన్స్ హాస్టల్ పనులు జరుగుతున్నాయి.

– శ్రీనివాసులు నాయుడు, ఈఈ, ఏపీఎంఎస్ఐడీసీ

సైబర్ నేరాలపై ఇంటింటా అవగాహన

- ఎస్పీ జగదీష్



అనంతపురం సెంట్రల్: జిల్లాలో ప్రతి ఇంటికీ వెళ్లి సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని ఎస్పీ జగదీష్ ఆదేశించారు. మంగళవారం స్థానిక జేఎన్‌టీయూ ఆడిటోరియంలో 'సైబర్ సురక్ష' కార్యక్రమంలో భాగంగా మహిళా పోలీసులకు వర్క్‌షాపు నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ రెండు నెలల్లో అన్ని ఇళ్లను కవర్ చేయాలన్నారు. డిజిటల్ అరెస్ట్, ఫెడెక్స్ కొరియర్, ఇన్వెస్ట్‌మెంట్, క్రిప్టో, స్టాక్ మార్కెట్, డెబిట్, క్రెడిట్ టాస్క్, జాబ్ లింక్, యాప్స్ ఫ్రాడ్స్, ఫేక్ లోన్ యాప్స్ తదితర మోసాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ల బెదిరింపులకు దిగితే 1930 టోల్ ఫ్రీ నంబర్‌లో లేదా సైబర్ క్రైమ్ వెబ్ సైట్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సైబర్ విభాగం సీఐ జాకీర్, ఎంఎస్ఎం టెక్నాలజీస్ ఎండీ మణికంఠ, గౌతమ్ పాల్గొన్నారు.

స్మార్ట్‌ఫోన్లకు బానిస కావొద్దు

నార్పల: స్మార్ట్ ఫోన్లకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్పీ జగదీష్ అన్నారు. మంగళవారం ఆయన నార్పల మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో నిర్వహించిన 'సైబర్ మోసాలపై అవగాహన' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల కాలంలో మహిళలు, పిల్లలను టార్గెట్ చేసుకుంటున్న ఘటనలు ఎక్కువయ్యాయన్నారు. ఓఎల్ఎక్స్, పేటీఎం, గూగుల్‌పే, ఫోన్‌పే, కేవైసీలకు సంబంధించి ఓటీపీ చెప్పాలంటూ వచ్చే మెసేజీలకు స్పందించవద్దన్నారు. సైబర్ క్రైమ్‌పై అవగాహన కోసం విద్యార్థినులు వేసిన చిత్రాలను పరిశీలించి అభినందించారు. ఎస్ఐ సాగర్, పాఠశాల ప్రిన్సిపాల్ సంగీత కుమారి తదితరులు పాల్గొన్నారు.

నాటుసారాపై ఉక్కుపాదం

- క్షేత్రస్థాయిలో విస్తృతంగా తనిఖీలు
- కలెక్టర్ వినోద్‌కుమార్



నవోదయం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో ఎస్పీ జగదీష్, జేసీ శివ్ నారాయణ్ శర్మ, ఇతర అధికారులు

అనంతపురం అర్బన్: జిల్లాలో నాటుసారా తయారీ, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నాటుసారా రహిత జిల్లాగా మార్చాలని చెప్పారు. 'నవోదయం 2.0'పై కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ పి.జగదీష్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక సరిహద్దు గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. జిల్లాలో ఐడీ మద్యం పీడిత గ్రామాలు 94 ఉన్నట్లు తేలిందన్నారు. ఆయా గ్రామాల్లో నాటుసారా నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీలు నిర్వహించాలన్నారు. నాటుసారాతో కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీపై డ్రోన్ల ద్వారా తనిఖీలు చేయాలని ఆదేశించారు. అనంతరం 'నవోదయం 2.0' పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో ఆర్డీఓ కేశవనాయుడు, ఎక్సైజ్ డీసీ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ మునుస్వామి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్ రెడ్డి, డీఎంహెచ్ఓ ఈబీదేవి, జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీరామ్, డీటీఈఓ వెంకటరమణ నాయక్, గిరిజన సంక్షేమాధికారి రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

'అమృత్' వేగవంతం కావాలి..


జిల్లాలో అమృత్ పథకం కింద చేపడుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాస్థాయి అడ్వైజరీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతపురం నగరపాలక సంస్థ, గుంతకల్లు, తాడిపత్రి మునిసిపాలిటీల్లో అమృత్ పథకం తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని గడువులోగా పనులు పూర్తి చేయాలని చెప్పారు. నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీ పడకూడదన్నారు. తదుపరి సమావేశానికి మునిసిపల్ ఇంజినీర్లు కూడా హాజరవ్వాలని ఆదేశించారు. సమావేశంలో ప్రజారోగ్యశాఖ ఈఈ ఆదినారాయణ, ఏపీఎస్ పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, ఉద్యాన శాఖ టెక్నికల్ అధికారి పల్లవి, మునిసిపల్ ఈఈలు రాధాకృష్ణ, హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

5లోపు సర్వే పూర్తి చేయాలి

అనంతపురం కార్పొరేషన్: జిల్లాలో ఎంఎస్ఎంఈ సర్వేను వచ్చే నెల 5లోపు పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు.మంగళవారం నగరంలోని కమలానగర్‌లో ఉన్న 14వ వార్డులో డబ్ల్యూవైసీ షాప్‌లో జరుగుతున్న సర్వేను కలెక్టర్ పరిశీలించారు. ఇప్పటి వరకు 37,606 ఎంఎస్ఎంఈల సర్వే పూర్తయిందన్నారు. ఎంఎస్ఎంఈలకు సమగ్ర మద్దతు అందించడం, పోటీతత్వం, బలమైన వ్యాపారాన్ని ప్రోత్సహించడం సర్వే లక్ష్యమన్నారు. ఎన్ని సంవత్సరాల నుంచి ఫీల్డ్‌లో ఉన్నారు, దీనిపైనే జీవనాధారం ఉందా, మరింత విస్తరించేందుకు రుణం సజావుగా దొరుకుతోందా, మార్కెటింగ్‌లో ఏమైనా సమస్యలున్నాయా అనే విషయాలపై కలెక్టర్ ఆరా తీశారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీధర, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్లు రవీంద్రనాథ్ రెడ్డి, నిశాంత్, భువనేశ్వరి, నగరపాలక సంస్థ ఈఈ షాకీర్‌హుస్సేన్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తీరు దుర్మార్గం

- మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

అనంతపురం కార్పొరేషన్: తాడిపత్రిలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు ఉండకూడదంటూ పోలీసులు చెప్పడం దుర్మార్గమని మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి విమర్శించారు. మంగళవారం స్థానిక రామ్‌నగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాడిపత్రికి తాను వెళ్తే శాంతిభద్రతలకు విఘాతం కల్గుతుందని చెబుతుండటం హాస్యాస్పదమన్నారు. టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి ఉండడంతోనే అక్కడ శాంతి భద్రతల సమస్య తలెత్తుతోందని, ఆరు నెలలు ఆయన అక్కడ ఉండకుండా చూస్తే శాంతి భద్రతలు అదుపులోకి వస్తాయన్నారు. పట్టణంలో వైఎస్సార్ సీపీ శ్రేణుల ఇళ్లకు మునిసిపల్ అధికారులు నోటీసులు జారీ చేయడం సరికాదన్నారు. జేసీ ప్రభాకర్ రెడ్డి కనుసన్నల్లో మునిసిపల్ కమిషనర్ శివరామకృష్ణ పని చేస్తున్నారని ఆరోపించారు. రానున్న రోజుల్లో ఆయన అవినీతి అక్రమాలపై కోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. సజ్జలదిన్నె గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఇళ్లే లక్ష్యంగా రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నారని, కనీసం నష్ట పరిహారం గురించి ఆలోచించే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. సజ్జలదిన్నె సర్పంచ్ ఇంటిని కూలగొట్టాలని చూస్తున్నారన్నారు. ఇంత జరుగుతున్నా కలెక్టర్, ఎస్పీ ప్రేక్షక పాత్ర పోషించడం అన్యాయమన్నారు. తాడిపత్రి రూరల్ మండలం గంగాదేవిపల్లె గ్రామ సర్పంచ్ హనుమంత రెడ్డి నాలుగు నెలలుగా ఊరికి దూరంగా ఉండేలా పోలీసులు దుర్మార్గంగా వ్యవహరించారన్నారు. ఇటీవల నంద్యాల జిల్లాకు చెందిన సత్యం రెడ్డి అనే వ్యక్తి జేసీ ప్రభాకర్ రెడ్డిని ప్రశ్నించాడని అతనిపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారన్నారు. అందుకు సంబంధించి ఫొటోలను మీడియాకు చూపించారు. బహిరంగంగా జేసీ ప్రభాకర్ రెడ్డి దౌర్జన్యాలకు పాల్పడుతున్నా జిల్లా ఎస్పీ ఏమాత్రమూ పట్టించుకోవడం లేదన్నారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని రానున్న రోజుల్లో వారే తప్పక బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. అధికారులు చట్టానికి లోబడి వ్యవహరించాలని హితవు పలికారు.



విద్యుద్దీపాలంకరణలో అనంతపురంలోని శివకోటి ఆలయం

ఓం నమఃశివాయ నామస్మరణతో శైవ క్షేత్రాలు మార్మోగుతున్నాయి. మహాశివరాత్రి వేడుకలను పురస్కరించుకుని సుందరంగా ముస్తాబయ్యాయి. బుధవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరగనున్నాయి. స్వామి దర్శనానికి తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. కాగా, అనంతపురంలోని పాతూరు చెన్నకేశవస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో జరిగిన శివరాత్రి వేడుకల్లో జిల్లా జడ్జి శ్రీనివాస్, కలెక్టర్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



బ్రహ్మకుమారీలు తయారు చేసిన మంచు శివలింగం



అనంతపురం పాతూరు చెన్నకేశవస్వామి ఆలయంలో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో నిర్వహించిన మహా శివరాత్రి వేడుకల్లో పాల్గొన్న జిల్లా జడ్జి శ్రీనివాస్, కలెక్టర్ వినోద్ కుమార్

దోచుకో 'తమ్ముడూ'!

- ఉపాధిలో 'తమ్ముళ్ల' అక్రమాలు
- నాలుగేళ్ల క్రితం నాటిన మొక్కలకూ నేడు బిల్లులు
- డ్రై ల్యాండ్ హార్టికల్చర్ పనులు జేసీబీలతో చేయిస్తున్న వైనం
- చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు



బ్రహ్మసముద్రం మండలం ఎస్.కోనాపురంలో ఇష్టారాజ్యంగా తవ్విన ఇంకుడు గుంత



పాలవెంకటాపురంలో ఐదేళ్ల క్రితం వనజ పొలంలో నాటిన నేరేడు మొక్కలు

కళ్యాణదుర్గం: కూటమి ప్రభుత్వంలో 'తమ్ముళ్ల' అక్రమార్జనకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. అధికారులు కూడా వత్తాసు పలుకుతుండటంతో 'పచ్చ' నాయకులు జేబులు నింపుకోవడమే పనిగా పెట్టుకున్నారు. బ్రహ్మసముద్రం మండలంలో ఇటీవల నేమ్ బోర్డుల్లో అక్రమాలు బయటకు రాగా.. తాజాగా ఇదే మండలంలోని పలు గ్రామాల్లో డ్రైల్యాండ్ హార్టికల్చర్, సామూహిక ఇంకుడు గుంతలు, బ్లాక్ ప్లాంటేషన్లలో జరుగుతున్న అవకతవకలు తీవ్ర విమర్శలకు తావిస్తున్నాయి.

జేసీబీలతో గుంతలు..

బ్రహ్మసముద్రం మండలం పాలవెంకటాపురం పంచాయతీ పరిధి మామడూరు గ్రామంలో రైతు విశాలమ్మ పొలంలో డ్రై ల్యాండ్ హార్టికల్చర్ పథకం కింద మామిడి మొక్కలు నాటేందుకు ఇటీవల ఎంపిక చేశారు. అయితే గుంతలను ఉపాధి కూలీలతో చేయించాల్సి ఉంది. ఇందుకు విరుద్ధంగా స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ జేసీబీతో గుంతలు తవ్వించారు. ఏకంగా రూ.48,767 నిధులు ఆమె ఖాతాకు జమ చేశారు. విశాలమ్మ ప్రస్తుత ఫీల్డ్ అసిస్టెంట్ బినామీగా గ్రామస్తులు చెప్పుకుంటున్నారు. ఇదే పంచాయతీ పరిధిలోని సూగేపల్లిలో ఉన్న చెన్నమల్లేశ్వర స్వామి మాన్యంలో బ్లాక్ ప్లాంటేషన్ పథకం కింద అభివృద్ధి పనులు చేసి ఆ మొత్తాన్ని సైతం స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ తన తండ్రి బోయ ఎర్రిస్వామి పేరిట బిల్లులు జమ చేసుకోవడం అనుమానాలకు తావిస్తోంది. ఎర్రిస్వామి ఖాతాకు అక్రమంగా రూ.19,156 నగదు జమయింది. దీంతోపాటు ఎస్. కోనాపురం పరిధిలో ఇష్టారాజ్యంగా సామూహిక ఇంకుడు గుంతలు తీసి రూ.33 వేలకు పైగా ఎర్రిస్వామి వ్యక్తిగత ఖాతాకు మళ్లించడం గమనార్హం.

చూసీ చూడనట్లు అధికారులు..

బ్రహ్మసముద్రం మండలంలో ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై సంబంధిత అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఉపాధిలో జరిగిన అవినీతిపై సోషల్ ఆడిట్ బృందాలు బహిరంగ వేదికలో వెల్లడించినా చర్యలు తీసుకునేందుకు వెనుకాడుతున్నారు.ఉన్నతాధికారులకు తెలిసినా కప్పిపుచ్చేందుకు యత్నించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఎప్పుడో నాటిన మొక్కలకు నేడు బిల్లులు..

బ్రహ్మసముద్రం మండలం పాలవెంకటాపురం గ్రామంలో టీడీపీ మండల కన్వీనర్ శ్రీరాములు తన భార్య పి.వనజ పేరిట ఐదేళ్ల క్రితం నేరేడు మొక్కలను నాటుకున్నాడు. కానీ, కూటమి ప్రభుత్వం వచ్చాక ఇటీవల డ్రై ల్యాండ్ హార్టికల్చర్ కింద మొక్కలు నాటినట్లు రికార్డులు సృష్టించాడు. రూ.17,178 బిల్లులు వనజ ఖాతాకు జమ చేసుకున్నాడు. అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రామ్మోహన్ తన సమీప బంధువు మల్లమ్మ పేరున నాలుగేళ్ల క్రితం నేరేడు మొక్కలను డ్రై ల్యాండ్ హార్టికల్చర్ పథకం కింద నాటినా.. కొత్త ప్రభుత్వంలో మొక్కలను నాటినట్లు రికార్డులు సృష్టించి రూ. 18,996 మింగేశారు.

క్లుప్తంగా

ఈవీఎంల భద్రతపై నిరంతర నిఘా ఉండాలి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం


లాగ్ బుక్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: ఈవీఎంలు భద్రపరిచిన గోదాముల వద్ద నిరంతరం సీసీ కెమెరా నిఘా, పటిష్ట భద్రత ఉండాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. పాత ఆర్డీఓ కార్యాలయ ఆవరణలోని గోదాముల్లో భద్రపరిచిన ఈవీఎంలను కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. గోదాముల వద్ద భద్రతను, సెక్యూరిటీ లాగ్ బుక్‌ను పరిశీలించారు. సెక్యూరిటీ లాగ్ బుక్‌లో నమోదు చేసే వివరాలు స్పష్టంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ కేశవనాయుడు, కో–ఆర్డినేషన్ విభాగం సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి, ఎన్నికల విభాగం డీటీ కనకరాజు, ఐటీ సపోర్ట్ శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటపై నైపుణ్యత పరీక్ష


చెరువులో చేపలను వేటాడుతున్న మత్స్యకారులు

అనంతపురం అగ్రికల్చర్: చేపల వేట, వల చుట్టడటం తదితర అంశాలపై మత్స్యకారులకు మంగళవారం రాప్తాడులో నైపుణ్యత పరీక్షలు నిర్వహించారు. మత్స్యకార సొసైటీలో కొత్తగా సభ్యత్వం కావాలంటే తప్పనిసరిగా ఈ రంగంలో నైపుణ్యత ఉండాలనే నిబంధన ఉండటంతో రాప్తాడు చెరువు వద్ద 21 మంది మత్స్యకారులకు అర్హత పరీక్ష నిర్వహించారు. మత్స్యశాఖ డీడీ శ్రీనివాసనాయక్, డివిజినల్ సహకార శాఖ అధికారి ప్రభాకర రెడ్డి, మత్యకార సొసైటీ జిల్లా యూనియన్ అధ్యక్షుడు నగేష్ ఆధ్వర్యంలో త్రిసభ్య కమిటీ సభ్యులు పరిశీలించారు. ప్రధానంగా చేపల వేటకు సంబంధించి ఈత కొట్టడం, వల చుట్టడం, వల వేయడం, బోటు నడపడం, చేపలను పట్టుకోవడం తదితర ఐదు అంశాలపై నిర్వహించిన నైపుణ్యత పరీక్షల్లో 18 మంది అర్హత సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పరిశీలకులు ప్రభాకర్, ఎఫ్‌డీఓ ఫక్కీరయ్య, ఫిషర్‌మెన్లు పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకుడి అరెస్ట్


నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

తాడిపత్రి టౌన్: స్థానిక బస్టాండ్ సమీపంలోని ఓ లాడ్జీలో మట్కా నిర్వహిస్తున్న అన్వర్ బాషాను మంగళవారం సీఐ సాయిప్రసాద్ అరెస్ట్ చేసారు. రూ.1.30 లక్షల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

పండుగ పూటా పస్తులే!

- రెండు నెలలుగా ఉపాధి కూలీలకు అందని వేతనం
- జిల్లాలో పేరుకుపోయిన రూ.13.05 కోట్ల బకాయిలు


పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

జిల్లాలో ఉపాధి కూలీలు, జాబ్‌కార్డుల వివరాలు

జాబ్‌కార్డుల సంఖ్య	2.60 లక్షలు
కూలీల సంఖ్య	4.60 లక్షలు
2024-25లో లక్ష్యం	1.15 కోట్ల పనిదినాలు
ఇప్పటి వరకు సాధించిన ప్రగతి	95.04 లక్షల పనిదినాలు
వేతన బకాయిల మొత్తం	రూ.13.05 కోట్లు

రాయదుర్గం: శివ శివ అంటూ చేతులు కాయలెక్కేలా కాయకష్టం చేసిన ఉపాధి కూలీలు.. మహాశివరాత్రి వేళ ఆ శివయ్యకు టెంకాయ సమర్పించేందుకూ చేతిలో చిల్లిగవ్వ లేక ఇబ్బంది పడుతున్నారు. చేసిన పనులకు సంబంధించి రెండు నెలలుగా వేతనం అందక కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి ఆరంభంలోనే ఎండలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. నేలలో నీటి శాతం ఆవిరై పనుల ప్రదేశాల్లో ఉపాధి పనులు కాయ కష్టంగా మారాయి. అయినా పండుగలను దృష్టిలో ఉంచుకుని కూలీలు పెద్ద ఎత్తున పనుల్లో పాల్గొంటూ వచ్చారు. ఈ నేపథ్యంలో జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించిన వేతనాలు చెల్లింపులకు సంబంధించి నిధులను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో కూలీల శ్రమకు విలువ లేకుండా పోతోంది.

నిబంధనలు తుంగలోకి

జిల్లాలోని 31 మండలాల్లో 2.60 లక్షల జాబ్ కార్డులుండగా 4.26 లక్షల ఉపాధి కూలీలు ఉన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 1.15 కోట్ల పనిదినాలు లక్ష్యంగా అధికారులు నిర్దేశించుకున్నారు. ఇప్పటికే సుమారు 95.04 లక్షల పనిదినాలు పూర్తయ్యాయి. గతేడాది డిసెంబర్ ఆఖరుకు రూ.249.9 కోట్ల వేతనాలను చెల్లించారు. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి మాసాల్లో చేసిన 5 లక్షల పనిదినాలకు సంబంధించి రూ.13.05 కోట్లు చెల్లించాల్సి ఉండగా ఇప్పటి వరకూ వారి ఖాతాల్లో డబ్బు జమకాలేదు. నిబంధనల మేరకు ఉపాధి హామీ పథకంలో పనిచేసిన కూలీలకు 21 రోజుల్లోపు వేతనాలు చెల్లించాల్సి ఉంది. అయితే ఈ నిబంధనను అధికారులే తుంగలో తొక్కి రెండు నెలలుగా వేతనాలు చెల్లించక కూలీలను ఇబ్బందులకు గురి చేస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి.

రెండు నెలల డబ్బు రావాలి

ఉపాధి హామీ పథకం కింద జనవరి, ఫిబ్రవరి నెలల్లో చేసిన పనులకు డబ్బులు రావాలి. రెండు నెలలు కావస్తున్నా ఇంకా బ్యాంకు ఖాతాలో సొమ్ము జమకాలేదు. దీంతో పండుగ పూట పస్తులుండాల్సి వస్తోంది. టెంకాయ, పూలు కొనాలన్నా ఇబ్బందిగానే ఉంది. ప్రభుత్వం స్పందించి త్వరగా వేతన బకాయిలు విడుదల చేయాలి.

– వన్నూరుస్వామి, భూపసముద్రం

త్వరలో ఖాతాలకు జమ

గత జనవరి 13 నుంచి ఇప్పటి వరకూ సుమారు 5 లక్షల పనిదినాలకు గాను రూ.13.05 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ నెలాఖరులోపు ప్రభుత్వం వేతనాలు జమ చేసే అవకాశం ఉంది. కూలీలు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు.

– సలీమ్‌బాషా, డ్వామా పీడీ, అనంతపురం

గజవాహనంపై బుగ్గ రామలింగేశ్వరుడు



తాడిపత్రి రూరల్: పట్టణంలోని బుగ్గరామలింగేశ్వర స్వామి మహా శివరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. 6వ రోజైన మంగళవారం స్వామివారు గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి మూల విరాట్‌కు అర్చకులు అభిషేకాలు నిర్వహించారు. మూల మూర్తిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. స్వామివారికి భక్తులు టెంకాయలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రజలకు ఎస్పీ మహాశివరాత్రి శుభాకాంక్షలు

అనంతపురం: మహా శివరాత్రి పర్వదినాన్ని జిల్లా ప్రజలందరూ సుఖ సంతోషాలతో చేసుకోవాలని ఎస్పీ జగదీష్ కోరారు. జిల్లా ప్రజలందరికీ ఆయన మహా శివరాత్రి సందర్భంగా మంగళవారం శుభాకాంక్షలు తెలిపారు. జాగరణ, శివపార్వతుల కల్యాణం తదితర ఉత్సవాల నేపథ్యంలో శైవ దేవాలయాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. తాడిపత్రి బుగ్గ రామలింగేశ్వరస్వామి దేవాలయం, జరుట్ల రామలింగేశ్వరస్వామి దేవాలయం, కూడేరు సంగమేశ్వరస్వామి, కోనుప్పలపాడు కోన మల్లేశ్వరస్వామి, కంబదూరు మల్లేశ్వర స్వామి, పంపనూరు, కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలు, అనంతపురం మొదటి రోడ్డులోని కాశీ విశ్వేశ్వర్యస్వామి తదితర ఆలయాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. మొబైల్ సెక్యూరిటీ హ్యాండ్ హోల్డ్ డివైస్ ద్వారా అనుమానితులను చెక్ చేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు.

'మన భద్రత – మన బాధ్యత'కు శ్రీకారం

- స్ఫూర్తినింపిన 2.5కే రన్
- లాంఛనంగా ప్రారంభించిన ఎస్పీ జగదీష్


రన్ ప్రారంభిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: 'సైబర్ సేఫ్ అనంతపురం' తమ లక్ష్యమని ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. జిల్లాలో సైబర్ నేరాలపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం నిర్వహించిన 2.5కే రన్‌ను ఆయన జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్, సప్తగిరి సర్కిల్, సుభాష్‌రోడ్డు, క్లాక్ టవర్, కోర్టు రోడ్డు మీదుగా తిరిగి పోలీస్ పరేడ్ మైదానానికి రన్ చేరుకుంది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. ప్రజల అమాయకత్వాన్ని సైబర్ నేరగాళ్లు తెలివిగా సొమ్ము చేసుకుంటున్నారన్నారు. వీరి ఆగడాలకు కళ్లెం వేయాలన్న లక్ష్యంతో సైబర్ సురక్ష (భద్రత – మన బాధ్యత) అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. డిజిటల్ వాహనాలు, టాంటాం ఆటోలు, ఆటోలకు స్టిక్కర్లు, హోర్డింగులు, కేబుల్ ప్రసారాల ద్వారా విస్తృత ప్రచారంతో పాటు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సైబర్ మోసాల అప్రమత్తతకు సహకరించిన వారికి జ్ఞాపికలు అందజేశారు. ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్‌బాషా, అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, సీఐలు షేక్ జాకీర్, కనుమూరి సాయినాథ్, శ్రీకాంత్ యాదవ్, రఘుప్రసాద్, ఆర్ఐ మధు, పీఆర్ఓ దామోదర్, సైబర్ కానిస్టేబుల్ షెక్షావలిని అభినందిస్తూ మెమెంటోలను ఎస్పీ అందజేశారు.

హోరాహోరీగా రాష్ట్ర స్థాయి వృషభాల బలప్రదర్శన


రాతి దూలాన్ని లాగుతున్న వృషభాలు

పామిడి: మండలంలోని వంకరాజుకాలవ గ్రామ సమీపంలో పెన్నప్పగుడి వద్ద వెలసిన ఎర్రితాత, ఫక్కీరప్ప స్వాముల ఆలయ 24వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం రెండో రోజు నిర్వహించిన రాష్ట్ర స్థాయి వృషభాల బల ప్రదర్శన హోరాహోరీగా సాగింది. అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ జిల్లాలకు చెందిన 10 జతల వృషభాలను రైతులు తీసుకువచ్చారు. అనంతపురం జిల్లా అక్కంపల్లికి చెందిన రైతు ఇంద్రారెడ్డి వృషభాలు ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నాయి. తాడిపత్రికి చెందిన రాజశేఖర్‌రెడ్డి బ్రదర్స్ వృషభాలు ద్వితీయ, నంద్యాల జిల్లా డి.రంగాపురం, మల్లెల గ్రామాలకు చెందిన ఎస్‌ఎస్‌వీ ట్రేడర్స్, రామకృష్ణారెడ్డి వృషభాలు తృతీయ స్థానాన్ని, కర్నూలు జిల్లా పి.రుద్రవరం, డి.రంగాపురం గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి, ఎల్లాగౌడ్ వృషభాలు నాల్గో స్థానాన్ని, మల్లెల గ్రామానికి చెందిన శేషయ్య జోగులు వృషభాలు 5 స్థానాన్ని రంగాపురం, తిప్పారెడ్డిపల్లికి చెందిన రైతులు రామకృష్ణారెడ్డి, దేవేంద్రరెడ్డి వృషభాలు ఆరో స్థానాన్ని, పెద్దవడుగూరు మండలం లక్షుంపల్లి గ్రామ రైతు శివారెడ్డి వృషభాలు 7 స్థానం, శింగనమల మండలం కల్లుమడి గ్రామానికి చెందిన రైతు నిఖిల్ వృషభాలు 8వ స్థానం, చిన్నకోడాయపల్లికి చెందిన రైతులు రాజు, రాజమోహన్ వృషభాలు 9 స్థానం, సిద్ధరాంపురం రైతు ఈశ్వరయ్య వృషభాలు 10 స్థానంలో నిలిచాయి. విజేత వృషభాల రైతులను అభినందిస్తూ నగదు పురస్కారాలతో నిర్వాహకులు సత్కరించారు. కాగా, పోటీల్లో భాగంగా బుధవారం ఆరుపళ్ల విభాగంలో వృషభాల బలప్రదర్శన ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

ప్రాంగణ నియామకాల్లో 40 మంది ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

అనంతపురం సెంట్రల్: ఎస్కేయూలోని పాలిమర్ సైన్స్ సెమినార్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో మొత్తం 40 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు దక్కాయి. బయాలజికల్ ఇంజినీరింగ్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో చేపట్టిన ఇంటర్వ్యూలకు మొత్తం 186 మంది విద్యార్థులు హాజరయ్యారు. దశలవారీగా నిర్వహించిన ఇంటర్వ్యూల ప్రక్రియలో 78 మంది తుది దశకు చేరుకున్నారు. వీరిలో ప్రతిభ చాటిన 40 మందికి ఆఫర్ లెటర్లను కంపెనీ ప్రతినిధులు అందజేశారు. ముఖ్యఅతిథిగా వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య అనిత హాజరు కాగా, రెక్టార్ ఆచార్య వెంకటనాయుడు, ప్రొఫెసర్లు నరసింహన్, రమేష్‌బాబు, రమణ, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ సోమశేఖర్, ఫ్యాకల్టీ జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ విద్యార్థి ఆత్మహత్య

అనంతపురం సిటీ: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... నార్పల మండలం నరసాపురం గ్రామానికి చెందిన ఎరికల వీరాంజనేయులు కుమారుడు పవన్‌కుమార్(20) ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో చదువుకుంటున్నాడు. తన సహచర విద్యార్థులతో కలసి అనంతపురంలోని ప్రకాష్ రోడ్డులో ఓ అద్దె గదిలో ఉంటూ రోజూ కళాశాలకు వెళ్లి వచ్చేవాడు. ఈ క్రమంలో ఓ యువతితో ప్రేమలో పడిన పవన్‌కుమార్... రెండు రోజుల క్రితం ఆమెతో గొడవపడ్డాడు. అప్పటి నుంచి ముభావంగా ఉంటూ వచ్చిన అతను సోమవారం రాత్రి 10 గంటల సమయంలో ఫోన్‌లో మాట్లాడుకుంటూ గది నుంచి బయటకు వెళ్లిపోయాడు. కాసేపటి తర్వాత తన స్నేహితుడు చిరంజీవికి ఫోన్ చేసి తాను రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలిపాడు. దీంతో స్నేహితులు అప్రమత్తమై వెంటనే పట్టాల వెంబడి గాలింపు చేపట్టారు. ఐటీఐ కళాశాల బాలికల హాస్టల్ సమీపంలోని పట్టాలపై ముక్కలైన పవన్‌కుమార్ మృతదేహాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో జీఆర్‌పీ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ప్రేమ వ్యవహారమే ఆత్మహత్యకు కారణమై ఉంటుందనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ముగ్గురిపై రౌడీ షీట్

కదిరి టౌన్: యువకుడిపై దాడి చేసి బలవంతంగా ద్విచక్ర వాహనాన్ని లాక్కెళ్లిన ముగ్గురిపై రౌడీషీట్ తెరిచినట్లు కదిరి సీఐ నారాయణరెడ్డి తెలిపారు. వివరాలను మంగళవారం ఆయన వెల్లడించారు. కదిరి పట్టణానికి చెందిన కళ్యాణ్, జునైద్, బాబా ఫక్రుద్దీన్ స్నేహితులు. గతంలో స్థానిక టీటీడీ కల్యాణమంటపం వద్ద పార్కింగ్ బాయ్‌గా పనిచేస్తున్న సోమశేఖరరెడ్డిపై వీరు దాడికి పాల్పడ్డారు. హతమారుస్తామని బెదిరించి అతని ద్విచక్ర వాహనాన్ని లాక్కెళ్లారు. గతంలోనూ వీరు పలు కేసుల్లో నిందితులుగా ఉన్నారు. నేర ప్రవృత్తిని వీడక పదేపదే దౌర్జన్యాలకు పాల్పడుతుండడంతో ముగ్గురిపై రౌడీ షీట్ తెరిచినట్లు పోలీసులు తెలిపారు.

యాత్ర పేరుతో ఘరానా మోసం


సనత్‌కుమార్

అనంతపురం: విహార యాత్ర పేరుతో ఘరానా మోసానికి పాల్పడిన వైనం అనంతపురంలో వెలుగు చూసింది. ఘటనకు సంబంధించి బాధితులు చేసిన ఫిర్యాదు మేరకు.. సిక్కిం రాష్ట్ర పోలీసులు కేసు నమోదు చేసి, మోసగాడి కోసం గాలింపు చేపట్టారు. వివరాలు... అనంతపురం నగరానికి చెందిన కాళసముద్రం సనత్‌కుమార్, కుంచాపు సాంబశివుడు, మలే రామారావు, మడుపూరు శ్రీహరి... నలుగురూ కలసి విహార యాత్రకు రూపకల్పన చేశారు. మూడు రాత్రులు, నాలుగు రోజులకు సంబంధించి 237 మంది యాత్రికులతో ప్యాకేజ్ మొత్తాన్ని వసూలు చేసి సనత్‌కుమార్ పేరుపై డిపాజిట్ చేశారు. ప్యాకేజీలో భాగంగా హైదరాబాద్, బెంగళూరు, త్రివేంద్రం నుంచి బాగ్డోగ్రాకు విమాన టిక్కెట్లను కొనుగోలు చేసి ఈ నెల 21న యాత్రికులను పిలుచుకెళ్లారు. సిక్కింలోని గ్యాంగ్‌టక్ చేరుకోగానే యాత్రికులు రూ.60 లక్షలు చెల్లించారు. మరుసటి రోజు భాగస్వాములలో ఒకరైన సనత్ కుమార్ రూ.60 లక్షలతో అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అతని కోసం గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో చివరకు గ్యాంగ్‌టక్‌లోని రాణిపూర్ పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించిన సీసీ టీవీ ఫుటేజీ వివరాలను పోలీసులకు అందజేశారు. అనంతరం అతి కష్టంపై యాత్రికులను స్వస్థలాలకు చేర్చారు. ఘటనపై సిక్కిం పోలీసులు కేసు నమోదు చేసి, మోసగాడి కోసం గాలింపు చేపట్టారు.

డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

అనంతపురం అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా 18 మంది డిప్యూటీ కలెక్టర్లను ప్రభుత్వం బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులను (జీఓ 408) జారీ చేసింది. వీరిలో అనంతపురం పీఏబీఆర్ డిప్యూటీ కలెక్టర్ జె.శిరీషను వైఎస్సార్ జిల్లా కడప అర్బన్ డెవలప్‌మెంట్ కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చారు. ఇప్పటి వరకూ పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న రామ్మోహన్‌ను అనంతపురం హెచ్చెల్సీ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించారు.

మతిస్థిమితంలేని యువతిపై అత్యాచారయత్నం

కళ్యాణదుర్గం రూరల్: మతి స్థిమితం లేని ఓ యువతిపై కళ్యాణదుర్గం మండలంలోని అదే గ్రామానికి చెందిన లక్ష్మన్న అత్యాచార్యయత్నానికి ఒడిగట్టాడు. పోలీసులు తెలిపిన మేరకు... గ్రామంలో డిష్ కేబుల్ నిర్వహిస్తున్న లక్ష్మన్న వారం రోజులుగా యువతి ఇంట్లో ఎవరులేని సమయంలో లోపలకు చొరబడి ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించేవాడు. మంగళవారం మధ్యాహ్నం ఇంట్లోకి వెళ్లి యువతిపై అత్యాచారయత్నం చేయబోగా ఆమె తప్పించుకుని పారిపోయింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. కాగా, ఈ అంశంలో స్థానిక టీడీపీ నేతలు జోక్యం చేసుకుని నిందితుడిని కాపాడే ప్రయత్నం చేస్తుండడం గమనార్హం.

బైక్ లాక్కెళ్లతామనడంతో...


హరికృష్ణ (ఫైల్)

శింగనమల: సకాలంలో కంతులు చెల్లించకపోతే ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుంటామంటూ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు బెదిరించడంతో మనస్తాపం చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... శింగనమల మండలం ఉల్లికల్లుకు చెందిన హరికృష్ణ (22)కు ఏడాది క్రితం వివాహమైంది. ప్రస్తుతం ఆయన భార్య ఐదు నెలల గర్భంతో ఉంది. బోర్లు వేసే పనితో కుటుంబాన్ని పోషించుకుంటున్న హరికృష్ణ ఇటీవల ప్రైవేట్ ఫైనాన్స్ ద్వారా ఓ ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేశాడు. కొన్ని కంతులు సకాలంలో చెల్లించాడు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ కంతులు సక్రమంగా చెల్లించలేకపోయాడు. దీంతో ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు కలసి కంతులు సక్రమంగా చెల్లించకపోతే వాహనాన్ని స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. దీంతో ద్విచక్ర వాహనాన్ని వారు తీసుకెళితే గ్రామంలో పరువు పోతుందని భావించిన హరికృష్ణ సోమవారం రాత్రి 9 గంటల సమయంలో కుటుంబ సభ్యులందరూ ఆరు బయట పిచ్చాపాటి మాట్లాడుకుంటుండగా ఇంట్లో తన భార్య చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా ఇంట్లోకి వెళ్లిన కుటుంబసభ్యులు విషయాన్ని గుర్తించి వెంటనే హరికృష్ణను కిందకు దించి పరిశీలించారు. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ విజయ్‌కుమార్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బండల ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు


బస్సు ఢీకొనడంతో బోల్తాపడిన ట్రాక్టర్

తాడిపత్రి రూరల్: బండల ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో పలువురు గాయపడ్డారు. సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపిన మేరకు.. మంగళవారం బుగ్గ నుంచి తాడిపత్రి వైపు బండల లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ వెంకటరెడ్డిపల్లి వద్దకు చేరుకోగానే వెనుకనే వేగంగా దూసుకొచ్చిన బనగానపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ట్రాక్టర్ ట్రాలీ బోల్తాపడింది. బండలు చెల్లాచెదురుగా పడి ముక్కలయ్యాయి. ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ గురుమూర్తి కాలు విరిగింది. ప్రయాణికులు ఎం.లక్ష్మీదేవి, వెంకటరాముడు, లక్ష్మీదేవి, కృష్ణయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స కోసం 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. రోడ్డుకు అడ్డంగా పడిన బండలను తొలగించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.


రిక్షాను లాగలేక ఇబ్బంది పడుతున్న వృద్ధుడు


నగర వీధుల్లో తిరుగుతూ బిందెలు విక్రయిస్తున్న వృద్ధురాలు

బతుకు పోరు

జీవితమంటేనే పోరాటం. కష్టసుఖాలు వస్తుంటాయి..పోతుంటాయి. కొందరిని మాత్రం కష్టాలు జీవితాంతం వెంటాడుతుంటాయి. మలిసంధ్య వేళలోనూ బతుకు పోరాటం చేయాల్సిన పరిస్థితి. వృద్ధాప్యం కారణంగా శరీరం సహకరించకపోయినా అష్టకష్టాలు పడుతూ బతుకు బండిని నెట్టుకొస్తుంటారు. అలాంటి వారిని చూసినప్పుడు అయ్యో పాపం అన్పిస్తుంది. పూట గడవడం కోసం ఓ వృద్ధుడు రిక్షాపై మోయలేని బరువు వేసుకుని అవస్థలు పడుతూ వెళుతుండగా.. మరో వృద్ధురాలు బిందెలు అమ్ముతున్న దృశ్యాలు అనంతపురంలో 'సాక్షి' కెమెరా కంటపడ్డాయి

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

హరోం హర



శివబాలయోగి ఆశ్రమంలో అలంకరణలో అనంతేశ్వరుడు

● మహాశివరాత్రికి సిద్ధమైన శైవక్షేత్రాలు

అనంతపురం కల్చరల్: మహా పర్వదినాన్ని ఘనంగా నిర్వహించడానికి శైవ క్షేత్రాలు శోభాయమానంగా ముస్తాబయ్యాయి. సకల పాపాలను హరించి దైవోన్ముఖం గావించే ఈ పండుగ నాడు ఉదయమంతా ఉపవాసముండి రాత్రంతా శివనామస్మరణతో మేల్కొంటే సకల శుభాలు సంభవిస్తాయన్న విశ్వాసం అమితంగా ఉంది కాబట్టే బుధవారం మహాశివరాత్రి పర్వదినం నాడు ఉదయం ప్రత్యేక పూజోత్సవాలు, రాత్రి శివపార్వతుల కల్యాణ మహోత్సవం, రాత్రి జాగరణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

తొలిసారి లక్ష లింగార్చన

జిల్లాలోనే తొలిసారిగా శివబాలయోగి మహరాజ్ ఆశ్రమం వారు 108 మంది దంపతులతో సహస్ర లింగార్చన, సామూహిక లక్ష లింగార్చన కార్యక్రమానికి పెద్ద ఎత్తున నిర్వహించేందుకు శ్రీకారం చుట్టారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి ఆశ్రమంలో సర్వదేవతా ఆవాహన, మహారుద్ర, పంచామృత సహిత ఏకవార రుద్రాభిషేకాలు ఘనంగా జరుగుతాయని నిర్వాహకులు అరవింద్, రత్నగిరి దేవరాజ్ తెలిపారు.

నగరంలో మహా శివరాత్రి వేడుకలు

శ్రీశైలాన్ని తలపిస్తూ వేడుకగా సాగుతున్న శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన పర్వదినానికి మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వరాలయం, పాతూరులోని అతి ప్రాచీనమైన విరూపాక్షేశ్వరాలయం, నగరశివార్లలోని శివకోటి, అరవింద నగర్‌లోని సర్వేశ్వరాలయం, మారుతీనగర్‌లోని కాశీవిశ్వేశ్వర కోదండరామాలయం, ఓబుళదేవనగర్, విద్యుత్‌నగర్ సర్కిల్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించడానికి సిద్ధమయ్యాయి. తపోవనంలోని జగదీశ్వరాలయం విద్యుద్దీపకాంతులతో సుందరంగా ముస్తాబైంది. మూడవరోడ్డులోని గొంగడిరామప్ప ఫంక్షన్ హాలులో అనంత శివారాధన సమితి వారు బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

శైవక్షేత్రాలకు శివరాత్రి శోభ

రాప్తాడు: మహాశివరాత్రి ఉత్సవాలకు మండలవ్యాప్తంగా ఉన్న శివాలయాలు సిద్ధమయ్యాయి. మండల కేంద్రంలో వెలసిన ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాలు నిర్వహించేందుకు గురుస్వాములు చిత్రా నాగేంద్ర, గౌరవ శివయ్య, పామాల రామచంద్ర, తలారి శివ, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. రాప్తాడులో రామేశ్వరస్వామి ఆలయం, చిన్మయనగర్‌లో గౌరి ప్రసన్నేశ్వరస్వామి ఆలయం, అయ్యవారిపల్లి, గంగలకుంట, బోమ్మేపర్తి, పుల్లలరేవు, యర్రగుంట, ఎం.బండమీదపల్లి, గాండ్లపర్తి, బుక్కచెర్లలోని శివలాయాలు, హంపాపురం మానగిరిక్షేత్రం, మరూరు చిన్నకదరయ్యస్వామి, అయ్యవారిపల్లి ఎర్రితాత ఆలయంలో ప్రత్యేక పూజలు జరగనున్నాయి.



బ్రహ్మకుమారీలు ఏర్పాటు చేసిన శివలింగం

భక్తిశ్రద్ధలతో శివజయంతి మహోత్సవం

అనంతపురం కల్చరల్: బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటూ సాగే 89వ త్రిమూర్తి శివజయంతి మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. స్థానిక పాతూరు చెన్నకేశవ స్వామి ఆలయం వేదికగా ×మహిళల కోసం సశక్తీకరణ⁋ అనే అంశంపై సిస్టర్ శారద నేతృత్వంలో జరిగిన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, జిల్లా జడ్జి శ్రీనివాస్, సీనియర్ ఏపీపీ దుర్గాదేవి, కార్పోరేటర్ రామాంజనమ్మ ప్రారంభించి మాట్లాడారు. స్త్రీలు స్వశక్తిపైన ఆధారపడేలా శ్రమించాలని ఆ దిశగా వారికి సమాజం కూడా తోడ్పాటునందించాలని సూచించారు. లక్ష దీపోత్సవంలో భాగంగా భక్తులందరూ దీపాలు వెలిగించడంతో ఆలయ పరిసరాలు దేదీప్యమానమయ్యాయి. నిర్వాహకురాలు శారద మాట్లాడుతూ బుధవారం శివరాత్రి సందర్భంగా ఉదయం నుంచే ద్వాదశ జ్యోతిర్లింగాలు, కోటిలింగ, వజ్రలింగ దర్శనం ఉంటాయన్నారు.

ఘనంగా విశ్వ జన్మదిన వేడుకలు



పేదలకు భోజనం వడ్డిస్తున్న విశ్వేశ్వరరెడ్డి దంపతులు



విశ్వకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు అందించారు. వివిధ ప్రాంతాలకు చెందిన నేతలు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సర్వజనాస్పత్రి ముందు విశ్వ దంపతులు పేదలకు అన్నదానం చేశారు. తన పుట్టిన రోజున అన్నదానం చేయడం సంతోషంగా ఉందని విశ్వ పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సీపీ వీరన్న, లోకనాథ్ రెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికులకు కౌన్సెలింగ్

అనంతపురం సిటీ: అనంతపురం రైల్వే స్టేషన్‌లో వివిధ విభాగాల్లో పని చేసే కార్మికులతో పాటు వెండర్లకు జీఆర్‌పీ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు మంగళవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులను గుర్తిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. ప్రయాణికుల భద్రతతో పాటు రైల్వే ఆస్తుల పరిరక్షణలో కార్మికుల పాత్ర కీలకమన్నారు. రైల్వే స్టేషన్‌తో పాటు రైళ్లలో తినుబండారాలను ఎక్కువ ధరలకు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వినూత్నరీతిలో జాగరణ మహోత్సవం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ సహకారంతో వినూత్నంగా జాగరణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ధర్మప్రచార మండలి సభ్యుడు శ్రీపాద వేణు తెలిపారు. మంగళవారం శివపార్వతుల కల్యాణోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివరాత్రి వేడుకలకు దత్త అవతార స్వరూపులైన మాణిక్యప్రభు మహారాజ్ ప్రియశిష్యులు రాఘవేంద్ర మాణిక్యప్రభు విచ్చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపం వేదికగా శివరాత్రి సందర్భంగా ఆదిశంకరుల కల్యాణ మహోత్సవంతో పాటూ మహాగణపతి పూజ సంకల్పం, మహాత్రిపుర సుందరి సమేత పరమేశ్వర సహస్రలింగార్చన జరుగుతాయన్నారు. టెన్త్, ఇంటర్మీడియట్ చదివే విద్యార్థుల కోసం సరస్వతీ పూజ చేసిన కంకణాలను స్వామిచేతుల మీదుగా కట్టిస్తామన్నారు. ప్రముఖ గాయనీగాయకులు, శాస్త్రీయ నాట్యాచార్యులు, కళాకారులతో ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. పురాణేతిహాసాలపై క్విజ్ ఉంటుందన్నారు. దత్తాత్రేయస్వామి పాదుకలను 50 మంది దంపతులకు వితరణ చేస్తామని ముందుగా వారి పేర్లను టీటీడీ కల్యాణమండపంలో నమోదు చేసుకోవాలని కోరారు. అలాగే వినికిడి సమస్య ఉన్న 10 మంది భక్తులకు వినికిడి మిషన్లను దాత రాజశేఖరరెడ్డి అందిస్తారని తెలిపారు. ధర్మప్రచార మండలి సభ్యులు పాల్గొన్నారు.

సుబ్బిరెడ్డి మృతి రైతు ఉద్యమానికి తీరని లోటు



సుబ్బరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం అర్బన్: రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బడా సుబ్బిరెడ్డి అకాల మరణం రైతు ఉద్యమానికి తీరని లోటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్, జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తరిమెల నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుబ్బిరెడ్డి చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు రాంభూపాల్, నల్లప్ప మాట్లాడారు. సుబ్బిరెడ్డి ఉమ్మడి అనంతపురం జిల్లాలో రైతుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారన్నారు. ఆయన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ప్రతి కార్యకర్త ప్రజాసమస్యలపై ఉద్యమించాలన్నారు. నాయకులు బాలరంగయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, రామాంజినేయులు, శివారెడ్డి, మధుసూదన్ నాయుడు, విరుపాక్షి, రాజారాం రెడ్డి, బీహెచ్‌రాయుడు, పోతులయ్య, ఈరప్ప, సువర్ణమ్మ, చిదంబరమ్మ పాల్గొన్నారు.

సమాజ సేవకులకు సత్కారం

అనంతపురం కల్చరల్: జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఇటీవల అనంత గుడ్ సమరితన్ అవార్డునందుకున్న ఎంఎండీ (ముస్లిం మైనార్టీ డెవలప్‌మెంట్ అసోసియేషన్) అధ్యక్షుడు ఇమామ్‌ను మంగళవారం ముస్లిం స్వర్ణకారులు పాతూరులో ఘనంగా సత్కరించారు. మాజీ కోఆప్షన్ సభ్యులు మున్వర్, సాదిక్, షేక్ పీర తదితరులు మాట్లాడుతూ ముస్లిం సమాజానికి ఇమామ్ అనేక సేవలందించారని, ప్రభుత్వ డీవీఎంసీ సభ్యులుగా కూడా పని చేస్తుండడం అభినందనీయమన్నారు. ఇదిలా ఉండగా పాతూరు జామియా మసీదు వద్ద ఐఎంఎం బాషా, ఇతర ముస్లిం పెద్దలు ఇటీవల అనంత సర్వీసు ఐకాన్ అవార్డునందుకున్న ఇమ్రాన్‌ను ఆత్మీయంగా సత్కరించారు.

రుణాలకు ఎంపిక

అనంతపురం అర్బన్: జాతీయ విభిన్న ప్రతిభావంతుల ఆర్థికాభివృద్ధి సంస్థ ద్వారా జిల్లాలో 14 మంది దివ్యాంగులు ఎంపికయ్యారు. రుణం కోసం దరఖాస్తు చేసుకున్న 18 మంది దివ్యాంగులకు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీరిలో 14 మందిని అర్హులుగా ఎంపిక చేశారు. వీరికి రూ.33 లక్షలు రుణ మంజూరు సిఫారసు చేశారు.

వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: కొప్పల మీనాక్షమ్మ ఆరవ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని ఆదిత్య మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ రాజశేఖర్ స్వరూప్, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ శ్వేత, డాక్టర్ శాంతి స్వరూప్‌లు 150 మంది రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరం ఏర్పాటుకు రవికాంత్ రమణ సహకరించారు. కార్యక్రమంలో కొప్పల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రైతుల అవసరం మేరకే గిడ్డంగుల ఏర్పాటు



మాట్లాడుతున్న ఐసీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్యామ్‌కుమార్

అనంతపురం ఎడ్యుకేషన్: రైతుల అవసరం మేరకు గిడ్డంగులు ఏర్పాటు చేసినట్లు ఐసీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్యామ్ కుమార్, గిడ్డంగుల మేనేజర్ ఖాన్ తెలిపారు. మంగళవారం రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ అధ్వర్యంలో రాచనపల్లి సొసైటీ సభ్యులకు గుత్తిరోడ్డులోని ఆంధ్రప్రదేశ్ గిడ్డంగుల సంస్థ ఆవరణలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా సహకార అధికారి అరుణ కుమారి మాట్లాడుతూ సహకార సమృద్ధిలో భాగంగా ఎంపీఎప్సీ గోడౌన్ల కంప్యూటరీకరణ, కామన్ సర్వీస్ సెంటర్లు, జనరిక్ మెడిసిన్స్ మొదలైన సేవలను పీఏసీఎస్ ద్వారా అందిస్తున్నారన్నారు. రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధరలు వచ్చేంత వరకూ నిల్వ చేసుకొనేలా అవకాశం కల్పించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వాలు గిడ్డంగులను నిర్మించాయన్నారు. సొసైటీ సీఈఓ శ్రీనివాస్, సహకార సంఘం పీఐసీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రోషన్ జమీర్, రైతులు పాల్గొన్నారు.

నాటుసారా తయారు చేస్తే చర్యలు

ఆత్మకూరు: గ్రామాల్లో ఎవరైనా నాటుసారా తయారు చేస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ హెచ్చరించారు. మంగళవారం సింగంపల్లి తండాలో నాటుసారా తయారీ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐలు జయనరసింహ, జాకీర్‌హుసేన్, కృష్ణారెడ్డి, ఏఎస్ఐ దస్తగిరి పాల్గొన్నారు.

ఘనంగా మెహర్‌బాబా జయంతి

అనంతపురం కల్చరల్: ప్రముఖ ఆధ్యాత్మిక గురువు మెహర్‌బాబా జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. స్థానిక కోవూరునగర్‌లోని మెడిటేషన్ సెంటర్‌లో పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చి బాబా చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు బలరామ్, రమణారెడ్డి, కృష్ణమూర్తి జెండా ఆవిష్కరించారు. అంతకు ముందు మెహర్‌బాబా సంకీర్తనలతో ప్రాంగణం మార్మోగింది.

‘ఫీజుకు హాల్‌టికెట్లకు ముడి పెడుతున్నారు’

అనంతపురం ఎడ్యుకేషన్: కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో ఫీజులకు హాల్‌టికెట్లకు ముడి పెడుతున్నారని బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ విద్యార్థి సమాఖ్య నాయకులు వాపోయారు. మంగళవారం ఆర్‌ఐఓ వెంకటరమణనాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్‌యాదవ్ మాట్లాడుతూ ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రారంభవుతున్న నేపథ్యంలో కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలంటూ ఒత్తిళ్లు చేస్తున్నాయన్నారు. నాయకులు రమేష్, విష్ణు, లోహిత్, శివ, ధర్మ, గణేష్, నూర్‌బాషా ఉన్నారు.

గజ వాహనంపై పార్వతీ పరమేశ్వరులు

అనంతపురం కల్చరల్: మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో మహాశివుని బ్రహ్మోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. మంగళవారం రాత్రి స్వామివారు గజ వాహనంపై నగరవీధుల్లో ఊరేగారు. కోలాటం కళాకారులు నాట్యాలతో అలరించారు. ఉదయం ఆలయంలో దీక్షా హోమాలు, రుద్రాభిషేకాలు జరిగాయి. ఈవో రమేష్‌బాబు, భక్తులు పాల్గొన్నారు.

నడిమివంకకు శాశ్వత పరిష్కారం చూపాలి

అనంతపురం కార్పొరేషన్: నడిమివంకకు ప్రొటెక్షన్ వాల్‌ను ఏర్పాటు చేసి, ఏళ్ల తరబడి నెలకొన్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్త్రీ విముక్తి సంఘటన, ఏఐఎఫ్‌టీయూ డిమాండ్ చేసింది. మంగళవారం నగరపాలక సంస్థ ముందు వారు ధర్నా చేపట్టారు. అంతకు ముందు క్లాక్‌టవర్ నుంచి నగరపాలక సంస్థ కార్యాలయం వరకు వారు ర్యాలీ నిర్వహించారు. ఎన్నికలకు ముందు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ప్రొటెక్షన్ వాల్ ఏర్పాటు చేస్తామని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు.

కేంద్రీయ విద్యాలయానికి ఆర్‌ఓ ప్లాంట్ వితరణ

అనంతపురం: పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయానికి ఎస్‌బీఐ బ్యాంకు రూ.2 లక్షల విలువ చేసే వెయ్యి లీటర్ల సామర్థ్యం కలిగిన ఆర్.ఓ ప్లాంట్‌ను వితరణ చేశారు. ఎస్‌బీఐ బ్యాంకు ఎండీ ఎంవీ రావు, గగన్ మహల్ ట్రస్ట్ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి హాజరయ్యారు. ప్రిన్సిపాల్ మార్కండేయులు సూరి పాల్గొన్నారు.